క్లుప్తంగా

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్


మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు, కుటుంబ సభ్యులందరికీ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరుల త్యాగనిరతిని, ధర్మ నిబద్ధతను, దైవ భక్తినిచాటే పండుగ బక్రీద్ అని వారన్నారు. మనకు కలిగిన దానిని సాటి వారితో కలిసి పంచుకోవాలని చెప్పే గొప్ప మానవతావాదాన్ని చాటేదే బక్రీద్ పండుగ అని వారన్నారు.

'నేను బడికి పోతా'పై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ ప్రసాద్, హెచ్‌ఎం రామశర్మ, ఉపాధ్యాయులు

దెందులూరు: విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా నినాదంతో అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఎంఈఓ ఏపీఎస్‌వీ ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం రామశర్మ, ఉపాధ్యాయులు ఫ్లెక్సీలు చేతపట్టి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రసాద్, ఎంఈఓ-2 అన్నమ్మ మాట్లాడుతూ బడి వయస్సు ఉన్న పిల్లలందరూ బడిలోనే ఉండాలని, ఎటువంటి వ్యవసాయ కార్మిక పనుల్లో పెట్టకుండా వారి భవిష్యత్తుకు బడి ఈడు పిల్లలంతా బడి బాట పట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

డీఎస్సీ వయో పరిమితిని పెంచాలి

ఏలూరు (టూటౌన్): ఆరేళ్లుగా డీఎస్సీ కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని, నూతన ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలకు ఏర్పాట్లు చేయడం హర్షణీయమని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో డీవైఎఫ్‌ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు పి.శివశంకర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితిని పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చాలా ఉపాధ్యాయ అభ్యర్థులకు వయస్సు పైబడిన నేపథ్యంలో వయో పరిమితిని పెంచడం ద్వారా వారికి కూడా అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గ్రూప్-1, గ్రూపు-2, పరీక్షలకు మూడు నెలల వ్యవధి పొడిగించాలని కోరారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌తో ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్, కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, ప్రకాష్ పాల్గొన్నారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ, అభివృద్ధి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి జిల్లా సైన్స్ అధికారిగా, బాలయోగి సైన్స్‌పార్క్ అధికారిగా సీహెచ్‌ఆర్‌ఎం చౌదరి విశేషంగా కృషి చేశారని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. జిల్లా సైన్స్ అధికారిగా పని చేస్తూ గత నెల 31న పదవీ విరమణ చేసిన సీహెచ్ ఆర్‌ఎం చౌదరి పదవీ విరమణ సన్మాన సభ ఆదివారం స్థానిక డీసీఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సైన్స్‌తోనే మానవ మనుగడ, అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ జీఎంసీ బాలయోగి సైన్స్ పార్కు అభివృద్ధికి చౌదరి నిరంతరం శ్రమించారన్నారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ తనకు ఉద్యోగ ధర్మంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఆర్ ఎం చౌదరి దంపతులను ఎమ్మెల్యే బడేటి చంటి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఉప విద్యాశాఖాధికారి రవిప్రకాష్, యునిసెఫ్ విశ్రాంత శాస్త్రవేత్త భాస్కర రావు, సీఆర్‌ఆర్ బీఈడీ కళాశాల ప్రిన్స్‌పాల్ గంగాధర రావు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీ రమణ, స్థానిక నాయకుడు ఆర్ ఎస్‌ఆర్ నాగేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందుల వర్తక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా మందుల వర్తక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. స్థానిక సూర్య కన్వెన్షన్ హాల్‌లో సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షునిగా నగరానికి చెందిన గుత్తా రవిచంద్ర, కార్యదర్శిగా చింతలపూడికి చెందిన వజ్రపు శేఖర్, కోశాధికారిగా జంగారెడ్డిగూడెంకు చెందిన టి. శివ రామకృష్ణ ఎన్నికయ్యారు.

అంకెలు కాదు.. ఆపద్బాంధవులు

- ఆపత్కాలంలో ఆదుకునే 100, 112, 104, 1098 సేవలు
- యువత, చిన్నారులకు వరం
- వీటికి తోడు మహిళా సంరక్షణకు దిశ యాప్

దెందులూరు: ఆపద వేళ ఆపద్బాంధవులను పిలిచేందుకు 100, 112, 104, 1098 నంబర్లను గుర్తుంచుకోవడం ఎంతో అవసరం. తల్లిదండ్రులు, జీవిత సహచరుల నంబర్లతో పాటు ఈ నంబర్లు కూడా విధిగా గుర్తు పెట్టుకుని అవసరం అనుకున్న వేళ వాడుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ నంబర్ల నుంచి ఫోన్ కాల్స్‌పై పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. కాల్ రాగానే ఆలస్యం లేకుండా సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుంటున్నారు. అవసరం అనుకుంటే అరెస్టులు కూడా చేస్తున్నారు. మనం చేయాల్సిందల్లా ఒకే ఒక పని అత్యవసర వేళ సంకోచించకుండా ఎమర్జెన్సీ నంబర్లకు ఫోన్లు చేయడం. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరిగే అకృత్యాలను అడ్డుకోవడానికి చిన్నారులపై, యువతులపై లైంగిక దాడులు జరిపే నేరగాళ్ల పనిపట్టడానికి ఈ ఎమర్జెన్సీ కాల్స్ ఎంతో ఉపయోగపడతాయి. 24 గంటలూ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు కొన్ని ఎమర్జెన్సీ టోల్‌ఫ్రీ నంబర్లు ప్రవేశపెట్టాయి.

దిశా యాప్ ఉండనే ఉంది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశా యాప్ పై ప్రజల్లో నమ్మకం పెరిగింది. యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ క్లిక్ చేస్తే చాలు ఆపదలో ఉన్న సంకేతాలు నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరి వెంటనే పోలీసులు అప్రమత్తమై సమస్యలు పరిష్కరిస్తారు.

డయల్ 100

చాలా కాలంగా అందుబాటులో ఉన్న నంబరు డయల్ 100. ఈ నంబరుకు డయల్ చేస్తే నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. బాధితుల తమ పరిస్థితులను వివరించిన తరువాత అక్కడి నుంచి సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు లైన్ కలిపి అప్రమత్తం చేస్తారు. జీపీఎస్ లోకేషన్ ఆధారంగా సమీపంలోని పోలీసులను, వాహనాలను అప్రమత్తం చేయడమే కాకుండా బాధితులు ధైర్యంగా ఉండేలా పలు సూచనలు చేస్తారు. పోలీసులు అక్కడకు పది నిమిషాల్లో చేరుకుంటారు.

1091 మహిళా సెల్‌కు అనుసంధానం

మహిళలను అత్తింటి వారు, భర్త హింసించడం కొట్టడం వంటివి చేస్తే 1091కి కాల్ చేస్తే నేరుగా మహిళా సెల్‌కు కనెక్ట్ అవుతుంది. అంతేకాక మహిళలపై దాడికి పాల్పడినప్పుడు ఎవరైనా బయటకు వచ్చి చూసినా, ఈ నంబర్‌కు కాల్ చేయవచ్చు. పిల్లలను హింసించినా సాయం కోరవచ్చు.

మహిళల సమస్యలకు 112

గతంలో మహిళల సమస్యలపై నేరుగా 100కు ఫోన్ చేస్తే పోలీస్ యంత్రాంగం వెంటనే అప్రమత్తమయ్యేది. ఇప్పుడు అన్ని రకాలు ఫిర్యాదులు ఆ నంబరుకు రావడంతో మహిళల సౌలభ్యం కోసం ప్రత్యేకించి 112 నంబరును కేంద్ర హోం శాఖ ప్రవేశపెట్టింది. బాధితులు ఎక్కడి నుంచి అయినా ఫోన్ చేస్తే రాష్ట్రంలో పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. 112 మొబైల్ యాప్ కూడా ఉంది.



108 టోల్‌ఫ్రీ నంబర్

రైలు ప్రయాణీకులకు 182

ఈ నంబరు రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న ఆర్‌పీఎఫ్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. రైలులో ప్రయాణించేటప్పుడు ఎవరైనా లైంగికంగా వేధింపులకు గురైనా, దొంగతనాలు, ఆపదలో ఉన్న సమయంలో ఈ నంబరుకు కాల్ చేయవచ్చు. బాధితులు ప్రయాణిస్తున్న సంబంధిత రైలులో ఉండే ఆర్‌పీఎఫ్ పోలీసులకు కంట్రోల్ రూమ్ నుంచి మెసేజ్ వెళ్తుంది. వెంటనే బాధితులున్న బోగిల్లో పోలీసులు అప్రమత్తమై సమస్యను పరిష్కరిస్తారు. సైబర్ నేరాల పరిష్కారానికి 9121211100 మహిళలు ముఖ్యంగా యువతులపై జరిగే సైబర్ నేరాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సైబర్ మిత్ర పేరిట వాట్సాప్ నంబరు 9121211100కు ఆంధ్రప్రదేశ్ పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. ఆపదలో ఉండి అత్యవసర పరిస్థితుల్లో ఈ నంబర్‌కు మెసేజ్ పంపిస్తే పోలీసులు చేరుకుంటారు. 24 గంటలూ అందుబాటులో ఉంటుంది.

మహిళలకు భద్రత



మహిళల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. మహిళలను వేధింపులకు గురిచేస్తే ప్రస్తుత చట్టాల ద్వారా కఠినంగా శిక్షించవచ్చు. ప్రజలు ఎమర్జెన్సీ నంబర్లను వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోచ్చు.

– లక్ష్మయ్య, డీఎస్పీ, నూజివీడు

పరిశ్రమల వ్యర్థాల నీటితో దుర్వాసన



నీలాద్రిపురం-ఉంగుటూరు రహదారిని ఆనుకుని ఉన్న మురుగునీరు డ్రెయిన్ నల్లగా ఉన్న దృశ్యం

ఉంగుటూరు: పరిశ్రమల వ్యర్థాలు నీటితో (మురుగునీరు) దుర్వాసన వ్యాపిస్తోందని ఉంగుటూరు వాసులు అంటున్నారు. నీలాద్రిపురం-ఉంగుటూరు ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న ఈ రహదారి మూడు కిలోమీటర్ల పైనే ఈ డ్రెయిన్ ఉంది. పరిశ్రమల నుంచి వదిలే వ్యర్థ జలాలు ఇందులోకి చేరుతున్నాయి. నీటి ప్రవాహం లేక ఉంగుటూరు వద్ద మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో దుర్గంధభరితంగా మారింది. ఈ డ్రెయిన్ ఆనుకుని ఉన్న నివాసితులు, ఆ రహదారిన నడిచి వెళ్లే వారు, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఆ దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ దీనిపై ప్రజాప్రతినిధులకు, అధికార్లులకు వారు విన్నవిస్తున్నారు. ఉంగుటూరు రైల్వేగేటు ప్రాంతంలో అడ్డుగా గట్టు ఉండటంతో ఈ మురుగునీరు ముందుకు వెళ్లడంలేదు. ఈ మురుగునీరు కిందికి పారేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉంగుటూరు నుంచి నీలాద్రిపురం వరకు వెలసిన ఐస్ పరిశ్రమలు, పాలీమర్ పరిశ్రమలు, కోళ్ల ఫారాలు, పేపరు మిల్లులు, పింగాణీ పరిశ్రమలకు చెందిన వృథానీరు ఇందులోకి చేరుతోంది. ఈ విషయమై పంచాయతీ ఈవో గిరిని ప్రశ్నించగా ఆ డ్రెయిన్ నీరు పారే విషయమై చర్యలు చేపడతామని తెలిపారు. పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. పరిశ్రమల యజమానుల ద్వారా నీరు కిందికి వెళ్లేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భీమడోలు: భీమడోలులోని 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఏలూరు వైపుగా వెళ్లు లైన్ కండక్టర్‌ను మార్చుతున్న నేపథ్యంలో ఈనెల 17వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ (ఆపరేషన్) జేపీజీ నటరాజన్ ఆదివారం తెలిపారు. కండక్టర్ మార్పు జరగనున్నందున దెందులూరు మండల పరిధిలోని పోతునూరు, కేతవరం, భీమడోలు మండలం పరిధిలోని గుండుగొలను, రత్నాపురం, కోరుకొల్లు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల

దెందులూరు: భీమడోలు సబ్‌స్టేషన్ నుంచి ఏలూరు వైపు వెళ్లే లైన్ కండెక్టర్ మార్చడం కోసం సోమవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీజీ నటరాజన్ తెలిపారు. దెందులూరు మండలం పోతునూరు, కేదవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మొరాయించిన ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు

- నిలిచిన విద్యుత్ సరఫరాతో ప్రజల అవస్థ
- 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


భీమడోలులో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

భీమడోలు: భీమడోలు గాంధీబొమ్మ సెంటర్‌లో పాడైన 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా శిథిలావస్థకు చేరిన 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత సాంకేతిక సమస్యల నేపథ్యంలో పాడైంది. దీనితో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎండలు మండిపోవడంతో పాటు, ఉక్కపోతతో రాత్రంతా ప్రజలు అవస్థలు పడ్డారు. ఇళ్లల్లోని ఇన్వర్టర్లు పని చేయక వృద్ధులు, రోగులు, పిల్లలు ఉక్కపోతతో సతమతమయ్యారు. గాంధీబొమ్మ సెంటర్, గణపతి సెంటర్ తదితర ప్రాంతాల్లోని 300 విద్యుత్ కనెక్షన్లకు చెందిన వినియోగదారులు మంచినీటి సమస్యతో తీవ్ర ఇక్కట్లను చవిచూశారు. సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు ఆ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో అదే కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ జిల్లాలో అందుబాటులో లేదు. దీంతో జల్లెడ పట్టిన అధికారులు నిడదవోలులోని 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏఈ పి.రామస్వామి పర్యవేక్షణలో ప్రత్యేక వాహనంలో ఆదివారం భీమడోలు తీసుకుని వచ్చారు. విద్యుత్ శాఖ సిబ్బంది కొత్తగా తెచ్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను క్రేన్ సాయంతో ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 100 కేవీ, 60 కేవీల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు.

నేడు బక్రీద్ ప్రార్థనలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈద్ ఉల్ జుహా (బక్రీద్) పర్వదినం సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ముస్లింలు ఏర్పాట్లు చేశారు. నగరానికి చెందిన అంజుమన్- ముహాఫిజుల్- ఇస్లాం సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాత బస్టాండు సెంటర్‌లోని కర్బలా మైదానంలో ఉదయం 8 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు


డాక్టర్ పి.బాలను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ పెదవేగి మండల అధ్యక్షుడు జానంపేట బాబు

దెందులూరు: బాధ్యత, భరోసాలతో పాటు భవిష్యత్తు భరోసా కల్పిస్తూ, ప్రేమ, ఆపాయ్యత అనురాగాలను పంచేది నాన్నే అని వైఎస్సార్‌సీపీ పెదవేగి మండల అధ్యక్షుడు జానంపేట బాబు అన్నారు. ఆదివారం దెందులూరు మండలంలో విద్యా సంవత్సరం, చర్చిల్లో ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవరప్పాడు సెయింట్ జాన్స్ విద్యా సంస్థల్లో ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి.బాలను జానంపేట బాబు శాలువా, పూల బొకేలతో సత్కరించి కేక్‌ను కట్ చేశారు. ఫాదర్స్‌డే శుభాకాంక్షలు తెలియజేశారు. దెందులూరు సాల్వేషన్ ఆర్మీ మిలినియం చర్చిలో కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య ఆధ్వర్యంలో ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ పెద్దలు, సంఘస్తులు కేక్‌ను కట్ చేశారు. అనంతరం కోర్ ఆఫీసర్ రమణయ్యను సంఘస్తులు సత్కరించారు.

ముగిసిన క్రీడా శిక్షణ శిబిరాలు

- 30 రోజుల పాటు కొనసాగిన శిక్షణ
- ప్రతిభావంతులను గుర్తించి ప్రత్యేక తర్ఫీదు


ఏలూరు ఇండోర్‌స్టేడియం స్కూటింగ్ రింగ్‌లో పోటీలు నిర్వహిస్తున్న కోచ్ ఖాసిం

ఏలూరు రూరల్ : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏలూరులో చేపట్టిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ముగిసాయి. మే నెల 15న ప్రారంభమైన ఈ శిబిరాలు జూన్ 14 వరకూ కొనసాగాయి. ఆదివారం ఆఖరి వారం కావడంతో శిక్షకులు బాలబాలికలకు ప్రత్యేక పోటీలు నిర్వహించారు. నెలరోజుల పాటు సాగిన శిబిరంలో పెద్ద ఎత్తున బాలబాలికలు శిక్షణ పొందారు. తీవ్రమైన ఎండవేడిమి సైతం తట్టుకుని పిల్లలు సాధన చేయడం విశేషం. తల్లిదండ్రులు సైతం ఉత్సాహంగా పిల్లలను కేంద్రాలకు తీసుకొచ్చి ప్రోత్సహించారు.

ఆటలతో సేద తీరనున్న బాలబాలికలు

ఏడాది పొడవున పుస్తకాలతో కుస్తీ పడిన విద్యార్థులు ఆటలతో సేద తీరారు. చదువు, మార్కులు, ఫలితాల ఒత్తిడి నుంచి పిల్లలను దూరం చేసేందుకు ఆటలు ఏంతో ఉపకరించాయి. సెలవుల్లో అందించిన శిక్షణతో పిల్లలకు ఆటలపై మరింత మక్కువ పెరిగిందని తల్లిదండ్రులు భావిస్తున్నారు.

ఎన్నికల ఎఫెక్ట్

ఈ ఏడాది వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణపై సార్వత్రిక ఎన్నికల ఎఫెక్ట్ పడింది. ఈ ఏడాది శిక్షణ శిబిరాలు ఏలూరు నగరానికి మాత్రమే పరిమితమయ్యాయి. నాలుగేళ్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ జిల్లా వ్యాప్తంగా సుమారు 50 పైగా శిబిరాలు ఏర్పాటు చేసింది. అనేక గ్రామాల్లోని జెడ్పీ, పట్టణాల్లోని మునిసిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులతో శిక్షణ శిబిరాలు నిర్వహించింది. ఈ ఏడాది మే నెలలో ఎన్నికల జరగడంతో అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్నికల నిర్వహణలో భాగస్వామలయ్యారు. దీంతో శిబిరాలు నిర్వహించేందుకు పీఈటీలు అందుబాటులో లేరు. దీనికి తోడు జిల్లా అధికారులు అనేక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో శిక్షణ శిబిరాల నిర్వహణకు అనుమతి ఇవ్వలేదు. ఫలితంగా క్రీడాధికారులు శాప్‌కు చెందిన శిక్షకులతో మాత్రమే ఏలూరులో శిబిరాలు నిర్వహించారు.


ఏలూరులో ఉత్సాహంగా స్కేటింగ్ సాధన చేస్తున్న చిన్నారులు


ఏలూరు భిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో సాధన చేస్తున్న చిన్నారులు

సాధన చేసే సమయం ఇదే



ఏడాది పొడవునా పిల్లలు పుస్తకాలతో కుస్తీ పట్టారు. బడికి సెలవులు రావడంతో ఇప్పుడు ఆటలపై ఆసక్తి చూపారు. కొన్నేళ్లుగా ఏలూరు భిశ్వనాథ్ స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ అందిస్తున్నాం. ఇక్కడ శిక్షణ పొందిన పిల్లలు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో రాణించారు. అధికారికంగా శిబిరం ముగిసినప్పటికీ శిక్షణ కొనసాగుతూనే ఉంటుంది.

– గణేష్, కోచ్, ఏలూరు

ఆటలపై పెరిగిన ఆసక్తి



రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో పిల్లలు ఎంతో ఆసక్తిగా పాల్గొన్నారు. ఏలూరులో 10 మంది కోచ్‌లతో హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ, స్కేటింగ్, టీటీ, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ అందించాం. శిక్షణ శిబిరంలో ప్రతిభ చాటిన వారిని కోచ్‌లు గుర్తించారు. రాబోయే రోజుల్లో వీరికి ప్రత్యేక శిక్షణ అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తాం.

– బి శ్రీనివాసరావు, జిల్లా చీఫ్‌కోచ్

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ఉంగుటూరు: ఈదురు గాలులకు వెల్లమిల్లి ప్రాంతంలో మూడు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. ఆదివారం మెట్ట ప్రాంతంలోని ఉంగుటూరు, యర్రమళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో నారాయణపురం, ఉంగుటూరులో ఎన్‌టీఆర్, వైఎస్సార్, జగనన్న కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

ద్వారకాతిరుమల: సీపీఆర్ టెక్నిక్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి పరిస్థితుల్లో ఏ లక్షణాలు ఉన్న వ్యక్తికి వాటిని ఉపయోగించాలో తెలుసుకోవాలని తాడేపల్లిగూడెంకు చెందిన ఆత్మబంధువులం సేవా సంఘం అధ్యక్షుడు కడియాల పరశురామయ్య అన్నారు. ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయ అనివేటి మండపంలో ఆత్మబంధువులం సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీపీఆర్ టెక్నిక్స్‌పై భక్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎప్పుడు, ఎలాంటి పరిస్థితుల్లో, ఏ లక్షణాలున్న వ్యక్తికి ఈ సీపీఆర్ టెక్నిక్స్ ఉపయోగించాలి, సీపీఆర్‌ను ఎలా చేయాలనే విషయాలను ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు పరశురామయ్య, తిరుమళ్ల సూరిబాబు మాట్లాడుతూ శరీరానికి బాహ్యంగా తగిలే చిన్నచిన్న గాయాలకు మనం ఏవిధంగా ప్రథమ చికిత్స చేసుకుంటామో, శరీరం లోపల పదిలంగా ఉండే గుండెకు నొప్పి కలిగినా, అది ఆగిపోయినా వెంటనే పునరుత్తేజపరిచేందుకు సీపీఆర్‌ను ఉపయోగించాలన్నారు. సీపీఆర్ ద్వారా మనిషి ప్రాణాపాయం నుంచి బయటపడతారన్నారు.

సామాజిక సేవ అందరూ గర్వించదగ్గ అంశం


పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో వృద్ధులు, వికలాంగులు, అనాథ పిల్లలకు సేవ చేయడం అందరూ గర్వించదగ్గ విషయమని నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ 3వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక రామకృష్ణాపురం ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ సమీపంలోని బ్రిడ్జి కింద నివాసం ఉంటున్న పేద కుటుంబాలు, అనాథల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ నూర్జహాన్, పెదబాబు దంపతులు హెల్పింగ్ హార్ట్స్ వార్షికోత్సవ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలు, అనాథలకు బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు, పరుపులు, దోమ తెరలు దుప్పట్లు, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సేవా దృక్పథం కలిగిన యువత ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. మూడేళ్లుగా హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ అనేక సేవా కార్యక్రమాలతోపాటు రక్తదాన శిబిరాలను నిర్వహించారని అభినందించారు. మంచి ఆశయాలతో ముందుకు వెళుతున్న ఈ విద్యార్థులను మేయర్ నూర్జహాన్, కో- ఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు మనస్ఫూర్తిగా అభినందించారు. వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలను నేటి తరం యువత స్ఫూర్తిగా తీసుకొని పేదలకు బాసటగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబ్బన శ్రీనివాసరావు, హెల్పింగ్ హార్ట్స్ సంస్థ వ్యవస్థాపకులు షేక్ హాఫీజ్, ఆయన తండ్రి షేక్ సలీం, తల్లి ఆజ్మీ, సేవా సంస్థ సభ్యులు షరీఫ్, ఆలీఫ్, షారుక్, గణేష్, అఖిల్ పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం పార్టీ ముద్రించిన కరపత్రాలను ఆదివారం ఉదయం ఆ పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్, పార్టీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో పేదలకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలన్నారు. ఎక్కడా ఇది అమలు కావడం లేదన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఏటా 10 శాతానికి పైగా ఫీజులు పెంచుతున్నారని విమర్శించారు. విద్యార్థుల నుంచి ఫీజులు మాత్రమే కాకుండా మెటీరియల్ పుస్తకాలు, డిజిటల్ క్లాసులు, ఏసీ బ్లాకులు, ఎగ్జామ్ ఫీజులు, స్కూలు అభివృద్ధి ఫీజులు వంటి రకరకాల పేర్లతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వద్ద నుంచి వసూలు చేస్తున్నారన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాసంస్థల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి స్కూల్లో విద్యార్థులకు విజ్ఞానం పెంచడానికి ప్రత్యేకంగా లైబ్రరీ, ల్యాబ్, క్రీడా మైదానం, క్రీడా పరికరాలు ఉండాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా టీచర్ల నిష్పత్తి, క్లాస్ రూములు, టాయ్‌లెట్ రూమ్‌లు ఉండాలన్నారు. ఇవి ఎక్కడా పాటించడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనలు, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయకుండా ఇష్టానుసారంగా ఏటా ఫీజులు పెంచుతున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు కె.రామాంజనేయులు, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు పాల్గొన్నారు.